# గాలి మనిషి



**- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్**

“మళ్లీ ఆ వెధవ నెందుకు రానిచ్చావ్?” ఉరుములా వినిపించిన ప్రశ్నకి ఆకులా కంపిస్తూ శ్రీవారి మొహంలోకి దీనంగా చూశాను. నాకు తెలుసు— నా చూపులో నాకు తెలియని శక్తి ఏదో ఉందని, ఎంత కోపంలో ఉన్నా ఆ ఒక్క చూపుతో ఆయన చల్లబడి పోతారని.

ఆయన చిరాగ్గా మొహం తిప్పేసుకున్నారు, ఓటమి కనిపించకుండా.

“నీకు లక్షసార్లు చెప్పాను— ఆ గాలివెధవ నీ ఛాయలక్కూడా రానివ్వద్దని. ఆ అడుక్కుతినేవాడికీ, నీకూ ఉన్న అనుబంధమేమిటో అర్థం కాదు నాకు.” విసురుగా టై విప్పుకుంటూ ఒక్కో మాటా అంటున్నారు.

వాడు— అడుక్కునే ‘రామూ’గాడు, ఈయన్ని చూస్తూనే పారిపోయి ఉంటాడు. ఆయన చేతివేడి అప్పటికే అనుభవమైంది వాడికి. అందుకే బెబ్బులిని చూసిన లేడిలా బెదిరి కనుమరుగవుతాడు.

కానీ, రోజు కొక్క దఫా అయినా నన్ను చూడందే ఉండలేడు వాడు. నిజానికి నేనూ అంతే!

గాలిమనిషి!

పాపం! పట్టుమని పదేళ్లకూడా లేవు వాడికి. ఆరేళ్లుంటాయేమో? అమాయకమైన మొహం. ఒక కంట్లో తెల్లటి పువ్వు. బాగా మాసిపోయిన తల. ఊటలా కారే వాసిక. వేసుకుంటే చొక్కా. లేకపోతే లాగూ. రెండూ కలిసి వాడి ఒంటిమీద ఏనాడూ చూడలేదు నేను.

వాడికి ఆరోగ్యసూత్రాలు తెలియవు. మట్టిలో పొర్లాడుతాడు. శ్మశాన శంకరుడిలా వాడి ఒంటినిండా విభూతి పట్టినట్లు పట్టుకుంటుంది దుమ్ము. గోళ్లనిండా దట్టంగా నల్లటి మట్టి. ఆ చేతులు శుభ్రంగా కడుక్కోవాలని కూడా వాడికి ఉండదు. ఏదన్నా తినటానికి పెడితే ఆ చేతులతోనే ఆత్రంగా తినేస్తాడు. ఎన్ని యుగాల ఆకలి వాడి కడుపులో కాపురముందో అనుకుంటాను వాడలా తినటం చూసి. తృప్తితో వాడు

తల ఆడించేంతవరకు ఏదో ఒకటి తినటాని కిస్తూనే ఉంటాను.

ఇలాంటి అర్భకుడిమీద, అనాథమీద లోకానికి పగ, అసహ్యం. అకారణమైన ద్వేషం. వాడి నెవరో 'గాలివెధవ' అని తిట్టారు. అది ప్రచారం లోకి వచ్చి వాడు గాలివని పంబుపోయాడు.

వాడి అసలు పేరు 'రాము!'

రాముడంటే ఈ దేశంలో దేవుడనే నమ్మకముంది. 'రామ' శబ్దంలో అనంతమైన శక్తి స్వరూపా లున్నట్లు నిర్వచనా లున్నాయి. కానీ, ఆ పేరుమీద ఒక దరిద్ర నారాయణుడు మాత్రం దెయ్యంలా ప్రచారంలో ఉన్నాడు! 'కలియుగే స్మరణాన్ ముక్తిః' అన్న నమ్మకంకూడా జనాల్లోంచి తప్పుకుంది కాబోలు. లేకపోతే, కనీసం వాణ్ణి 'రామిగా' అనే అపభ్రంశపు పేరుతోనన్నా పిలిచి ఉండేవాళ్ళు.

నిర్మలమైన ప్రేమ చెట్టు నీడ లాంటిది. బాధోపహతులను ఆదరించి సేద తీరుస్తుంది. ఎందుకనో వాణ్ణి చూసినప్పుడల్లా నా హృదయంలో ఎవరో విచారగీతికలు పాడినట్లు, వీణా రవాన్ని మంద్రస్థాయిలో వినిపిస్తున్నట్లు అనుభూతి కలుగుతూ ఉంటుంది. వాడి మొహంలో తృప్తి ఆ అమాయక నేత్రాల్లో ప్రతిఫలించి, అవి వెలిగిపోతే నా కెంతో ఆనందం.

వాడికి తెలుగు రాదు.

నాకు తమిళం తెలియదు.

ఈ మాట ఎందుకనవలసి వచ్చిందంటే, వాడి మాతృభాష తమిళం గనక. బెంగుళూరులో అన్ని భాషలూ చెలామణీ అవుతాయి. కన్నడం కంటే తెలుగు ఎక్కువ వ్యాప్తిలో ఉన్నదా అనిపిస్తుంది నాకు. తమిళంకూడా తక్కువేమీ కాదు.

పోతే, 'రాము' తల్లిదండ్రులు కార్మిక వర్గానికి చెందినవాళ్ళు. కడుపు చేత పట్టుకుని జీవనాధారం కోసం వచ్చిన వాళ్ళు. వీడు వాళ్ళ కొక్కడే బిడ్డ. పగలంతా వాళ్ళు పనిపాటల కోసం వెళతారు. వీడు ఆ ఇల్లూ, ఈ ఇల్లూ తిరిగి దొరికినంత తిని ఆటపాటలతో పొద్దు పుచ్చుతాడు.

వాడిని ఆదరణతో పలకరించేవాళ్ళ కన్నా చీదరించుకునేవాళ్ళే ఎక్కువ. ఎక్కడో దాకా దేనికి? మే ముంటున్న ఇంట్లో నాలుగు వాటాలు ఉన్నాయి. మా వాటా బాగా లోపలగా ఉంటుంది. మిగతా వాటాలన్నీ దాటి మా వాటాదాకా రావాలంటే రామూకి పెద్ద సమస్య.

మొదటి వాటాలో 'లంఖిణి' ఉంది. ఆవిడకి నలుగురు పిల్లలు. పిల్లికి బిచ్చం పెట్టని రకం ఆటుంచి, అడుక్కునేవాడు పొరబాటున గుమ్మంలోకి వస్తే 'అల్సేషియన్' కుక్కకంటే భయంకరంగా మొరిగి, వాడు మొండికేసి కదలకపోతే మీద పడి కొట్టినంత పని చేస్తుంది. ఆవిడ అసలు పేరు లావణ్య. భాషను ఖూనీ చేసే సదుద్దేశ్యంతో ఆ పేరు పెట్టారేమో సనుకుంటాను. నేను పైన చెప్పిన రాద్ధాంతమంతా చూసి, నిరాశగా తిరిగి వెళుతున్న ఒక బిచ్చగాడు 'ఎక్కడో లంఖిణిలా ఉందిరా, బాబూ!' అనుకోవడం విన్నవాళ్ళు దాన్ని తక్షణం ప్రచారంలోకి తెచ్చారు.

లంఖిణిని దాటి దాగలిగితే (ఆవిడ సామాన్యంగా పెత్తనాలకు వెళుతుంటుంది, కొంప పిల్లలకి వదిలేసి), రెండో వాటాలో సుభద్ర ఉంది. ఆవిడ చాంతాడుని సైతం భద్రంగా అలమారులో ఉంచి బీగం వేస్తుంది. ఇంక బిచ్చగాడికి ధర్మ మేం చేస్తుంది?

మూడో వాటాలో మాణిక్యం ఉంటూంది. వాళ్ళాయనకి భారత్ ఎలక్ట్రానిక్స్‌లో పని. లవ్‌మారేజిట. మనిషి తెల్లగా, అందంగా ఉంటుంది. మొగుణ్ణి పేరు పెట్టి పిలిచేస్తుంది. కోపం వస్తే 'ఏరా' అనికూడా అంటుంది. పాపం! ఎప్పుడూ నీరసం, అనారోగ్యం. మంచంమీద బొమ్మలా పడుకుని వారపత్రికలూ వగైరాలతో ప్రొద్దుగడుపుతుంటుంది. కాఫీ దగ్గరనుంచి భోజనం వరకు భర్తే వెయ్యాలి. ఒకవేళ, ప్రేమించుకున్న రోజుల్లో షరతులు పెట్టుకున్నారేమో తెలియదు. అతను నోరు విప్పి అడిగేనడు. నాలిక ఆఫీసులో పెట్టి వస్తాడనుకుంటాను.

ఇహ నాలుగోది మా వాటా.

మా వాటా పక్కనే బావి. రామూ వచ్చి ఆ బావిస్తంభం దగ్గర నిలబడి "అమ్మా" అంటాడు బెరుగ్గా అటూ, ఇటూ చూస్తూ—నేను ఎంత పనిలో ఉన్నా వెంటనే వాడి కేకకి బదులు పలుకుతాను. పాత అల్యూమినియమ్ టిఫిన్ ఒకటి వాడి చేతిలో ఉంటుంది. "సాంబారు సాదం వేణుమమ్మా" అంటాడు దీనంగా. మా దంపతు లిద్దరికీ సాంబారు పెద్దగా ఇష్టం కాదు. అయినా తరుచు చేసే దాన్ని, కేవలం వాడి కోసం.

వాణ్ణి అసహ్యించుకునేవాళ్ళలో మా శ్రీవారు ఒకరు.

నాకు కొంచెం ఆలస్యంగా తెలిసిందేమిటంటే, అది అసహ్యం కాదని! ఆయన దొక తరహా. ఊరంతా ఒక దారి, ఉలిపికట్టె దొక దారిగా ఉండటం ఆయనకు గిట్టదు. నేను రామూమీద చూపించే అభిమానాన్ని వ్యంగ్యంగా, హేళనలతో చాలామంది విమర్శించేవాళ్ళు. ముఖ్యంగా ఇతర వాటాల వాళ్ళు. అది గమనించిన తరవాత రామూని రానియ్య

> ఒక మనిషిని గౌరవించడానికి, ఆదరించడానికి సంస్కారం కావాలి. ఈ సంస్కారం చదువులవల్లా, హోదాలూ, అదృష్టంవల్లా దొరకనిది. 'అమ్మా' అని నోరారా పిలిచే ముష్టి కుర్రాడి పిలుపులోని ప్రేమను అర్థం చేసుకొనడం సంస్కారమే. రోజూ పిడికెడు కబళం వేసే ఇల్లాలుకోసం ఎదురుతెన్నులు చూసే ముష్టివాడి మనసు లోతులు అర్థం అవడం కష్టమే.

వద్దని గట్టిగా చెప్పారు. కానీ, ఎలా రానివ్వకపోవటం? మొదటే వద్దనాలి గానీ, కొంతకాలం వాడిని ఆదరించి మధ్యలో కారణరహితంగా వాడిని దూరంగా ఉండమనటం ఎలా సాధ్యం?

పిలయినంతవరకు వాడు ఆయన ఇంట్లో ఉండని వేళల్లోనే వస్తుండేవాడు. కానీ, పొరబాటున ఏదో ఒక రోజున ఆయన కంట పడేవాడు. ఊరికే కాదు, నేను తినటాని కిచ్చిన పదార్థాలు ఆబగా, ఆ మురికి చేతులతో తింటూ! ఆ దృశ్యం ఆయన మనస్సుని కలచి వేసేది.

"చేతులు కడుక్కుని తినరా, వెధవా" అని తిట్టేవారు. వాడు ఆయన్ని చూస్తూనే తుర్రున పారిపోయేవాడు. ఒక మాటు అలా పరుగెడుతూ ఎదురు దెబ్బ తగిలి కింద పడ్డాడు. అన్నమంతా రోడ్డు పాలయింది. మోచేతులు' మోచిప్పలు పగిలాయి. ఏడుస్తూ లేచి, మన్నుకూడా దులుపుకోకుండా వెళ్ళిపోతుంటే నా మనసు ఆర్ద్రమయింది. వాడిని సమీపానికి పిలిచి, దుమ్ము దులిపి సముదాయించా లనిపించింది. వాడి గాయాలకు మందు రాయాలని మనసు తహతహలాడింది. ఆయన చిన్నబుచ్చుకుని ఇంట్లోకి వెళ్ళిపోయారు.

రోజు రోజుకీ వాడిమీద నా కున్న అభిమానం అభివృద్ధి అవుతూ వచ్చింది. ఒక్క రోజు వాడు రాకపోతే తోచేది కాదు. అన్నం సహించేది కాదు. పిచ్చి పిచ్చిగా ఉండేది. వాడు తమిళంలో ఏదో మాట్లాడేవాడు. నేను అర్థమైనట్లు తల ఆడించేదాన్ని. ఏదన్నా చెప్ప దలిస్తే తెలుగులో చెప్పేదాన్ని. మొదట్లో అర్థంగానట్లు అయోమయంగా చూసేవాడు. తరవాత, తరవాత మందహాసం చేస్తూ నిలబడేవాడు. కొన్ని మాటలు అర్థమైనట్లే బుర్ర తాటించేవాడు.

వాడిలో ఉన్న మరో విశేషమేమిటంటే, వాడి కమ్మని గొంతు.

ఏమిటేమిటో విచిత్రమైన పాటలు పాడేవాడు. కొన్ని వింటుంటే ఒకటే నవ్వు వచ్చేది. పకపక నవ్వేసేదాన్ని. వాడు మరింత సంబరంగా పాడేవాడు.

ఇదంతా లంఖిణి లేనప్పుడే సాధ్యమయేది. ఆవిడ ఉందంటే కట్టె పేడుని కర్రగా వాడి, వాడిని గేటు పర్యంతం తరుముకు వెళుతుంది.

ఓ మాటు ఏమయిం దనుకున్నారు? బహుశః అంత కాఠిన్యం మరే స్త్రీలోనూ చూడలేనేమో! ఆవిడకి ఆడజన్మ ప్రసాదించినందుకు బ్రహ్మను నిందించాలి.

అది శీతాకాలం. చలి వణికించేస్తూంది. ఉదయాన్నే లేచి పని పాటలు చేస్తూంటే — "న్యూమోనియా రాగలదు" అని మందలించి బలవంతాన నా చేత స్వెట్టరు తొడిగించేవారు ఆయన.

ఒక్కో మాటు ఆ చలికి చర్మం బిరుసెక్కినట్లనిపించేది. వేళ్ళు కొంకర్లు పోయేవి. చన్నీళ్ళు ముట్టుకుంటే మంట.

అలాంటి చలిలో రామూ తన గిన్నె తీసుకువచ్చాడు. ఆ రోజు ఏదో కన్నడుల పండుగ. నిలవ పదార్థాలు తినరు. శుచిగా స్నానం చేసి, పూజ వగైరాలు చేసుకుని రాత్రికి గానీ భోజనం చెయ్యరు. నిలవ పదార్థాలు దొరుకుతాయని ఇంటింటికీ వెళ్ళి అడుక్కుంటారు బిచ్చగాళ్ళు. రామూ అలాగే వచ్చాడు.

కళ్ళాపి చల్లుతున్న లంఖిణి చూసింది వాణ్ణి. అంతే! మరుక్షణం కేవలం లాగు ఉన్న వాడి ఒంటిమీద చెంబెడు పేడనీళ్ళు దిమ్మరించింది. నా మనసు భగ్గుమంది. కనీసం కుక్కపిల్లకుకూడా అలాంటి అత్యాచారం తలపెట్టలేము.

"లావణ్యగారూ! మీరు చేసిన పనేమీ బాగా లేదు" అన్నాను.

తీవ్రంగా చూస్తూ. అవతల రామూ చలికి తట్టుకోలేక గిజగిజలాడిపోతూ ఏడుస్తున్నాడు.

లావణ్య గొంతు పెద్దది చేసి నాతో లడాయికి దిగింది.

"నీకు బంధువయితే తెచ్చి ఇంట్లో ఉంచుకోకపోయినావా? ఏమిటో ఆ ముష్టి వెధవంటే *అంత అపేక్ష* నీకు?" ఇలా సాగిపోతూంది ఆవిడ ధోరణి. నేనేమని మాట్లాడాలో తెలియక తెల్లబోయి చూడసాగాను.

అంతలో ఇంట్లోంచి కోపంగా ఆయన పిలుపు వినిపించింది. ఇవతలికి వచ్చేశాను. అక్కడినుంచీ ఆవిడతో నోరు కలిపితే ఒట్టు. 'దుష్టం దూరేవ వర్జయేత్' అన్న నానుడి ఉండనే ఉన్నది కద?

* * *

"ఏమీ భయపడ నవసరం లేదు. ఇది మామూలుగా అందరికీ వచ్చే అనారోగ్యమే. మీరు తల్లి కాబోతున్నారు" అంది లేడీడాక్టరు మందహాసం చేస్తూ. మాణిక్యవీణారవంలా వినిపించా యా పలుకులు.

"థాంక్యూ వెరీ మచ్, డాక్టర్" అంటున్నా రాయన, ఆనందం నిండిన గొంతుతో.

నా మొహంలో ఆనందజ్యోత్స్నలు గమనించి, "బలమైన ఆహారం తీసుకోండి. నెలనెలా పరీక్ష చేయించుకోండి" అని వీడ్కోలు చెప్పింది.

దారంతా ఆయన ఒకటే హాస్యం. నేను చిరుకోపం నటిస్తూ, "చాల్లే ఊరుకోండి, ఎవరన్నా వింటారనికూడా లేదు" అని మందలిస్తే, ఆయన "మొగుడూ పెళ్లాల మాటలు వినటం వాళ్ల బుద్ధి తక్కువ. మనకేం?" అని మరికాస్త ఎక్కువ చేశారు.

నన్ను ఇంట్లో దించి ఆయన ఆఫీసుకి వెళ్లిపోయారు. ఒంట్లో నిస్త్రాణగా అనిపించి మంచంమీద నడుం వాల్చాను.

"అమ్మా!" రామూ గొంతు.

లేచే ఓపిక లేక— "మళ్లీ రా, రామూ" అన్నాను గదిలోంచే.

వాడు మళ్లీ "అమ్మా!" అన్నాడు.

నాకు ఎన్నడూ లేనిది వాడిమీద కోపం వచ్చింది. 'వెధవకి బాగా అలుసయి పోయింది" అనుకుని, చిరాగ్గా—"పోరా, పోయి మళ్లీ రా!" అని అరిచాను.

గుమ్మం దగ్గర నిశ్శబ్దం.

'వెళ్లిపోయాడులే' అనుకున్నాను. మనసులో ఏవేవో తీయని ఊహాలు. గోడమీద 'గ్లాక్సో' పాపాయి బొమ్మ బొద్దుగా, ముద్దుగా ఉంది. అలాగే చూస్తూ, నాకు తెలియకుండానే రెప్పలు వాల్చేశాను.

ఎంతసేపు అలా ఉన్నానో తెలియదు. ఏదో గలభాకి హఠాత్తుగా లేచాను. రామూ ఏడుపు వినిపిస్తూంది. దానికంటే ఎక్కువ స్థాయిలో అంఖిణి గొంతు. పక్క వాయిద్యాలకు మళ్లీ సుభద్ర, మాణిక్యంల గొంతులు.

మధ్య మధ్య నా పేరుకూడా ఎత్తుతున్నారు.

ఏదో పెద్ద గొడవే అయిందను కుంటూ నిద్రకళ్లతో బయటికి వచ్చాను. రుబ్బురోలు లాంటి అంఖిణి చేతిలో ఖైదీలా చిక్కి, తిట్లూ దెబ్బలూ తింటూ నిలబడ్డాడు రామూ. వాడి చేతిలో మా స్టీలుగిన్నె. అందులో నేను ఉంచిన టొమాటొబాత్ కింద ఒలికి ఉంది. ఆ గిన్నె వాడి చేతిలోకి ఎలా వెళ్లిందీ? !

జ్ఞాపకం వచ్చింది, నేను తలుపులు వేసి పడుకోలేదని! అయినా, నా కేం తెలుసు అట్లా అదమరిచి నిద్రపోతానని? తలుపులు వెయ్యకపోయినా, మా వాటాలకు ప్రమాదం లేదు. చుట్టూ మంచి ప్రహరీ ఉంది. ఎవరొచ్చినా ముందున్న చెక్కగేటు తీసుకు రావాలి. అది శిథిలావస్థలో ఉన్నదనుకోండి. అది వేరే మాట.

నేను తలుపులు వేసుకోనంత మాత్రాన వీడి ధైర్యం తగలెయ్యా, కొంపలో దూరి చేతి కందింది తినెయ్యట మేనా? వీడికి చనువిచ్చి ఎంత పొరబాటు చేశాను! కనకపు సింహాసనంమీదశునకంలా ప్రవర్తించాడే! ఈ సంగతి ఆయనకి తెలిస్తే మరేమన్నా ఉందా? అంఖిణి ప్రమేయం ఉన్నాక అది తెలియకుండా

ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే టూత్ పేస్ట్ -నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణచేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్ వారి ఉత్పత్తి

ఉంటుందనుకోవటం నా వెర్రి.

నాకు ఒళ్లెరగని కోపం వచ్చింది. అటు, ఇటు చూశాను. చిన్న కర్రపుల్ల ఒకటి కనిపించింది. అంతవరకు లంఖిణి చేతుల్లో తిన్న దెబ్బలకే ఒళ్లు కందిపోయి ఉన్నట్లుకూడా గమనించక శక్తికొద్దీ నాలుగు బాదాను.

"చేస్తావా, వెధవా, చేస్తావా? ఏదో బీద వెధవ్వని దయ తలిస్తే దొంగతనం చేస్తావా?" అరవసాగాను కోపంతో.

మొదట అందరూ బిత్తరపోయారు.

నే నేదో రక్షిస్తానేమోనన్న ఆశతో చూసిన వాడి చూపుల్ని నేను లక్ష్యం చెయ్యలేదు.

వాడు నా దెబ్బలకి మరింతగా బెదిరి పోయాడు. బొంగురుపోయిన గొంతుతో, కన్నీటిచారలు నిండిన మొహంతో, కళ్ళు నలుముకుంటూ, వెక్కిళ్లు పెట్టి మరీ ఏడుస్తున్నాడు. ఒక కన్ను మూసి దానినే ఆదే పనిగా నలుముతున్నాడు.

కుడి కంట్లోంచి పువ్వు తెల్లగా మెరుస్తూంది.

నా చేతిలోంచి కర్ర జారిపోయింది. శివుడు మూడో కన్నులా ఉన్న దది. నా ఆగ్రహాన్ని ధ్వంసం చేసి పారేసింది. వివశురాలినై గబగబ ఇంట్లోకి వెళ్లి పోయాను.

లంఖిణి అప్పుడు తేరుకుంది.

గొంతు రెండింతలు చేసింది. "తోట కూర నాడే ఉండాలని, ఈ బుద్ధి ముందరే ఉండాలి. ఈ వేళ రెండు బాదగా సరిపోయిందా? ఈ రోజు ఇదయింది. రేపు బంగారం దొరకపుచ్చుకు వెళ్లిపోతే మా కర్మేంగాను?"


నాకు అంత చీకాకులోనూ నవ్వు వచ్చింది.

లంఖిణి ఇంట్లో బంగారం రాసులు పోసుకున్నారుంది కాబోలు! ఇంతా ఏడిస్తే పుస్తెలతాడు మినహా మరో చిన్నమెత్తు బంగారం లేదు. సందు దొరికితే చాలు ఎన్ని మాటలయినా అంటారు.

రామూ కెలాగైతేనేం విముక్తి లభించింది. వాడిని మరో నాలుగు తిట్టి మెడ పట్టి గెంటినట్లు మాటల ద్వారా తెలుస్తూంది. "మళ్లీ ఇటుపక్క కొచ్చావంటే పోలీసుల కప్పజెపుతా" అని వార్నింగు ఇచ్చింది.

మా స్టీలుగిన్నెని లోపలికి గిరవాటు పెట్టింది. అది వెళ్లి ఆ గోడకీ, ఈ గోడకీ తగిలి మరి కాస్త శబ్దం చేసింది. సొట్ట పోయిందేమోకూడా. నాకు ఒళ్లు కుతకుత లాడిపోయింది. మరో రాద్ధాంతం ఇష్టంలేక అలాగే నిగ్రహం చూపాను.

ఆ రోజంతా నా మనసులో మనసు లేదు.




రామూగాడు తన్నులు తినటం, వాడి దీనమయిన మొహం, కుడి కంట్లో మశూచికం వల్ల వేసిన పువ్వు, నేను కర్రతో బాదటం, లంఖిణి ప్రవర్తన — వీటినే తలుచుకుంటూ గడిపాను.

వంట చెయ్య బుద్ధి కాలేదు. ఏమన్నా తిందామన్నా నోటికి రుచించలేదు.

ఎన్నడూ లేనిది ఆయన ఆఫీసునుంచి త్వరగా వచ్చారు. వచ్చిన కారణంకూడా తెలిసింది. "హనీ! త్వరగా రెడీ అవు. 'సంగమ్‌'లో పిక్చరుకి వెళదాం. టిక్కెట్లు తెచ్చాను" అన్నారు హుషారుగా ఈల వేస్తూ.

నేను మరో మాట మాట్లాడకుండా త్వరత్వరగా ముస్తాబు ముగించాను. ఆ విధంగానైనా మనసులోని బాధ తొలగుతుందేమోనని ఆశ పడ్డాను. మాణిక్యం, మళ్ళద్ర కళ్లింతలు చేసుకుని చూశారు మే మిద్దరం ఇంటికి తాళం వేసి వెళుతుంటే.

వాళ్ల గురించి నే నేమీ భయపడ లేదు గానీ, నా చూపులన్నీ లంఖిణి వాటా మీదనే ఉన్నాయి. ఖర్మం చాలక నోరు విప్పిందా, ఇక ఈ వేళకింతే—అదృష్టం! లంఖిణి ఎక్కడికో పేత్తనాలకు వెళ్లింది.

ఆటో మాట్లాడి 'సంగమ్' హాలు వైపు దారి తీశాం.

* * *

"కదలకు. ఏమీ కాలేదులే. చిన్న దెబ్బ. . ."

కళ్లు తెరిచి చూస్తే శ్రీవారి సముదాయింపు. ముక్కు అదర గొడుతూ స్పిరిట్ వాసన. తెల్ల యూనిఫారమ్‌లో నర్సులు. డాక్టర్ మొహంలో చల్లని మందహాసం. పైన గిరగిర తిరుగుతున్న ఫాను. ముంగురులు గాలి కటూ, ఇటూ కదులుతున్నాయి. జబ్బ కో ఇంజక్షనిచ్చి వెళ్లిపోయాడు డాక్టర్.

నాకు మెల్లగా స్మృతిలోకి వస్తున్నాయి గతించిన సంఘటనలు. ఇద్దరం 'సంగమ్' సినిమా హాలువైపు ఆటోలో బయలుదేరాం. ఆటో జోరుగా వెళుతూంది. మల్లేశ్వరంలోకి ప్రవేశించాము. అక్కడ బాగా నాలుగా ఉన్న చోట ఆటో డ్రైవర్ కంగారు పడుతూ "బ్రేక్. . . బ్రేక్ పడటం లేదు, సార్" అన్నాడు బిగ్గరగా.

ఇద్దరం ఒక్కసారే ఉలిక్కిపడ్డాం.

అటూ, ఇటూ వేగంగా కదులుతున్న వాహనాలు. ఆటో కంట్రోలు తప్పి అటూ, ఇటూ వెళుతూంది. ఎదురుగా మరో ఆటో వస్తూంది. ఆటోడ్రైవర్ బిగ్గరగా "తప్పుకో" అని అరుస్తున్నాడు. అంతే! తరవాత ఏమీ జ్ఞాపకం లేదు.

ఏక్సిడెంటు అయిందన్న మాట! ఆయన కేసి చూశాను. బట్టలు దుమ్ము కొట్టుకున్నాయి. కాస్త మొహం మీద డోక్కుపోయింది. నాకు కాళ్లు, చేతులు బాగానే ఉన్నాయి. తలమీద చిన్న దెబ్బ తగిలినందువల్ల స్పృహ పోయి ఉండాలి.

నయం. ప్రాణాలు దక్కాయి.

'ఈ రోజు ఎంత చెడు రోజు!' అనుకున్నాను మనస్సులో.

"లక్ష్మీ! నువ్వు ఒకటి రెండు రోజులు ఇక్కడే ఉండటం మంచిదన్నారు డాక్టర్ గారు. . ."

ఉలిక్కిపడ్డాను. "ఇక్కడే ఉండమన్నారా? ఎందుకని?"

"ప్రమాదంలో ఒళ్లు కదిలింది కాబట్టి, దానివల్ల గర్భాని కేమీ కాకుండా చూడటానికి. . ." నిజమే! నా కింత వరకూ ఈ సందేహమే కలగలేదు. ఏమన్నా అయితే, ఇంకేమన్నా ఉందా? నా ఆశలు, కలలు అన్నీ ఏమి కాను!

కళ్లు మూసుకున్నాను బాధతో.

"భయపడకు. ఏమీ కాదు. మనం చాలావరకు భయంతోనే కొన్ని విషయాలను నిజం చేస్తాం. ఏదీ, ఇటు చూడు. నే నింటికి వెళ్లి రేపు వస్తాను. నీ కేమి కావాలో అన్నీ వీళ్లు అమరుస్తారు. నిద్ర పోవటానికి ప్రయత్నం చెయ్యి. సరేనా?"

ఆయన వెళ్లటానికి లేచారు.

నాకు మనసంతా గుబులుగా ఉంది. ఆయన ఇక్కడే కూర్చుంటే చాలా బాగుంటుంది. కానీ, ఆ మాట పైకి ఎలా అనగలను? ఆ మురికి బట్టల్లో ఎలా కూర్చోగలిగారో గానీ, చూట్టానికి నాకే బాగా లేదు. ఆయన వెళ్లాక నేను ఒంటరితనంతో బాధపడాలి. అయినా తప్పదు.

"రేపు సెలవు పెట్టి వచ్చేస్తారు కదూ?" అచ్చం చిన్న పిల్లలా ప్రశ్నించాను.

ఆయన నవ్వి "అలాగే" అంటూ వెళ్లిపోయారు.

కనిపించేవరకు అలాగే చూస్తూండి పోయాను.

* * *

ఆటో వేగంగా పరుగెడుతూంది. వెనక్కి జారిపోతున్న దృశ్యాలు పరికిస్తూండిపోయాను. పదిహేను రోజులు ఆస్పత్రిలో ఉన్నానో, లేదో ఎన్నాళ్ల

తరవాతనో మళ్లీ ప్రపంచాన్ని, ఈ సందడినీ చూస్తున్నట్లుగా ఉంది.

రెండు రోజు లనుకున్నది పదిహేను రోజుల వరకు పట్టింది. నేను దేని గురించి భయపడ్డానో అది జరగనే జరిగింది! డాక్టర్లు ఎన్నో రకాల ఖరీదయిన మందులు వాడారు. ఫలితం శూన్యం.

చెమట అద్దుకుంటూ, ఓటమి నంగీకరిస్తూ ఆ రోజున డాక్టర్ అన్న మాట ఒక్కటే— "అయామ్ సారీ!"

నా కలలు, ఆశలు అంతరించాయి.

ఆయన లోపల బాధపడుతున్నా పైకి బింకంగా ధైర్యవచనాలు పలికారు. ఆస్పత్రి వాతావరణంలో, ఆ బెడ్‌మీద కదలకుండా పడుకుని, శూన్యమైన మనస్సుతో రెండు వారాలు గడిపాను.

ఈ వేళ స్వేచ్ఛ ఇచ్చారు!

'ఆటో' చెక్కగేటు ముందు ఆగింది. లంఖిణి, సుభద్ర, మాణిక్యం తమ వాటాల్లోంచి బయటికి వచ్చి "ఒంట్లో కులాసాగా ఉందా, లక్ష్మీ" అని పలకరించారు.

"ఆఁ ఆఁ" అన్నాను మందహాసం చేస్తూ. 'ఈమాత్రం మానవత్వమన్నా చూపారు, చాలు' అని సంతోషించాను.

* * *

"నువ్వెళ్లిన తరవాత ఏమైందను కున్నావ్" అంటూ వచ్చింది మాణిక్యం, ఆ సాయంత్రం.

"ఏమైంది?" అన్నాను కుతూహలంగా.

"ఆ గాలివెధవ మళ్లీ వచ్చాడు. మీ వారు ఆఫీసుకి వెళ్లిపోయేవారు కదూ? అక్కడే, గుమ్మం దగ్గర, తాళం కేసి చూస్తూ కూర్చునేవాడు కాస్సేపు. లావణ్య వాడిని మామూలు ధోరణిలో తిడుతున్నా కదలేవాడు కాదు. . ."

నా మనస్సు ఆర్ద్రమైపోయింది. వాడిని పాపం ఆ రోజున ఎంత కొట్టాను! కన్నతల్లికూడా అలా కొట్టిందో లేదో? వాడి నలా కొట్టే అధికారం నా కెక్కడిది?

మాణిక్యం కొనసాగించింది.

"మొదట మూడు రోజులూ నన్ను ఏమీ అడగలేదు కానీ, ఏదో అడగదలిచి నట్లు మాత్రం కనిపించే వాడు. నాలుగో రోజు వచ్చి అడిగాడు 'ఆ అమ్మ ఏ'దని. నేను వాడి బాధ గమనించి 'ఆస్పత్రిలో ఉంది' అన్నాను. అంతే. వాడి కేమయిందో వెంటనేగొల్లున ఏడవటం మొదలెట్టాడు. నాకు భయం వేసింది— చూసిన వాళ్లు నేను కొట్టాననుకుంటారేమోనని. సమయానికి లావణ్యగారు పెత్తనానికి వెళ్లటంవల్ల కాస్త తెరిపిగా ఉందప్పుడు. వాడిని ఊరుకో బెట్టటానికని ఆయనకు పొద్దున్నే చేసిన ఇడ్లీల్లో రెండు ఒక ఆకులో పెట్టి తినమని ఇచ్చాను. వాడు మరింత ఏడుస్తూ 'నాకు వద్దు. ఆ అమ్మ కావాలి నాకు' అనటం మొదలెట్టాడు. 'ఇదెక్కడి ప్రారబ్ధంరా' అనుకుంటుండగా సుభద్ర వచ్చి నాలుగు కసిరింది. దానితో ఏడుస్తూ వెళ్లిపోయాడు. మర్నాడు రాలేదు. ఆ మర్నాడు మళ్లీ వచ్చి మీ తలుపు ముందు కూర్చున్నాడు. నాలుగు రోజుల క్రితం వరకు వస్తూనే ఉన్నాడు. మనిషి దిగులుగా, జబ్బుతో ఉన్నట్లు అవుపించాడు. నేనే దయ తలిచి ఏమన్నా పెట్లినా తీసుకునే వాడు కాదు. . ."

నా కళ్లవెంట నీరు ధారాపాతంగా కారజొచ్చింది.

"నాలుగు రోజులనుంచీ ఇంతవరకు రానేలేదు. ఏమైందో మరి?"

"రాలేదా?" ఆత్రంగా అడిగాను.

"లేదు" అంది మాణిక్యం. అంతలో ఆయన వచ్చారు. మాణిక్యం వెళ్లిపోయింది.

• • •

రాముా ఆ మర్నాడు వస్తాడేమో అనుకున్నాను. నే నంటే ఎందుకు వాడి కంత మమకారం?— అని ప్రశ్నించు కున్నాను. సమాధానం దొరకలేదు. 'రాముా వస్తే బాగుండును' అని పదేపదే అనుకున్నాను.

రోజూ చెక్కగేటు దాకా వెళ్లి, వీథివంక చూస్తూ, మళ్లీ ఇంట్లోకి వస్తూ, అస్తిమితంగా గడిపేదాన్ని. మాణిక్యం నా బాధ అర్థం చేసుకున్నట్లు నవ్వేది.

సుభద్ర చూసీ, చూడనట్లు ఊరుకునేది. ఆస్పత్రినుండి తిరిగి వచ్చాక మాణిక్యం కాస్త దగ్గిరయింది నాకు. ఏమి టేమిటో కబుర్లు చెప్పేది. కానీ, నా ధ్యాస యావత్తూ 'రాముా' కనిపిస్తాడేమో అని చెక్కగేటు వైపు చూడటంతోటే సరిపోయేది. వాడి కోసం రోజూ పొంబారు చేసేదాన్ని. మర్నాడు చాలా మిగిలిపోయేది. దాన్ని అలాగే పారబోసేదాన్ని గాని, ఇంకెవ్వరికీ పోయలేకపోయేదాన్ని.

ఒక రోజు పొద్దున్నే పెత్తనాకిచి వెళ్లొచ్చిన లంఖిణి మాణిక్యా న్నుద్దేశించి — "విన్నావుటమ్మా! ఆ గాలివెధవ రాకపోతే ఏమిటో అనుకున్నాను. వాడికేదో మనాది పట్టుకుని జ్వరం కాసి చచ్చాట్ట. ఈ వేళ పరబ్రహ్మంగారింటి నుండి వస్తుంటే ఆ పక్కన ఖాళీ స్థలంలో ఉన్న పూరిగుడిసెలోంచి ఏడుపులేమిటని ఆరా తీస్తే ఇది! పోన్లే. సహం దరిద్రం విరగడైంది. మొండి పీనుగ" అంటూ మెటికలు విరిచింది.

నా ముందున్న ప్రపంచం గిరగిర తిరిగిపోయింది. ★

# ఆ రెండు కళ్ళు

## గుంటూరు. శేషేంద్రశర్మ

బహు జన్మల సమూహాలకు పూర్వం
వాటో నీవూ నీలో నేనూ ఉన్నాను కాబోలు. . .
ఆ కనులు— నా సువర్ణ ఇంద్రనీలాల గనులు—
వాటిలో తిలకిస్తూ పులకిస్తూ పోతే
హిమాలయ శిఖరా లధిష్ఠించిన ఒక నగరం
తారల తీరాల కెగిరిపోయే ఒక పతంగం
కోటి కిరణాల అంతరంగం
ఆ లోతుల్లో చూచా నీ సత్యం—
ఏవో తెలియని రహస్యాల కొసలు మసలే
ఆ కన్నుల్లో దర్శించాను, ఎప్పుడో విస్మరించిన
నా పరిమళాల ప్రపంచాన్ని—
అదృశ్యమైపోయిన నా బ్రతుకుల కోవల్లో కానల్లో
ఒయ్యారంగా, దారి కోసం ఇటు అటు
సంచరిస్తున్న ఒక అవ్యక్త షహనాయీ స్వర ఝరి—
నీరవ చరణ విన్యాసాలతో వచ్చి ఉషస్సు
చుంబించే నిశ్చల వనభూముల్లోకి
చంద్రకిరణం వంచి మెల్లగా జారి వచ్చిన
ఒక అప్సరసలాంటి హిందోళరాగ లహరి—
చెంగావి లేయెండలవంటి వలువలు దాల్చిన రాజమహిళలు
మన సర్వేంద్రియాల కోర్కెలు గూడు కట్టుకున్న,
వారి అల్లిన ఇరుల కురుల్లో చెరలాడే
కుసుమ తుందిల గంధిల నీలిమలు—
వారి మృదుమధువుల పెదవులపై
అల్లిబిల్లిగా అలమిన చిరునవ్వులు—
కోటల్లో తోటల్లో మేడల నీడల
పట్టుల్లో కూర్చుని
చెలికత్తెలు ఋతుగీతిక లాలపిస్తుంటే
కురంగి కన్నులు విప్పి చూస్తుంటే
రంగుల విహంగి పురి విప్పి నటిస్తుంటే
ఓ! ఏమి స్మృతులు! ఎన్నో మృతుల వెనుక
నిలిచి పిలిచే మందరాకృతులు—
ఆ విదూర వింధ్యోత్తర భూములు—
రాజపుటానా ఎడారి ఇసుకల్లో
మలుపులు తిరిగే అనంత మార్గాలు దుర్గాలు
ఆ గిరులు ఆ నగరులు ఆ ఝరులు ఆ తరువులు—
ఏ చిత్తరువులు మా నాన్న గ్రంథాల్లో చూచానో
ఒంటరి బాలుణ్ణిగా మేడమెట్ల మూల
ఏకాంతంగా కూర్చుని చూచానో
నా అవ్యక్త మనఃకుహరాంతరాల్లో వెతికానో
ఎప్పుడో పోగొట్టుకున్న ఏదో సౌందర్యం కోసం—
అది— ఆ సౌందర్యం!
ఇదిగో— దొరికిం దిప్పుడు ఈ కళ్లలో
దూరాన ఉదయించే ఆ ప్రాచీరేఖలో
పుట్టుక కోసం నిరీక్షిస్తూ
చిరునవ్వులు చిందే మోములతో కనిపించే
నా పుట్టని ప్రియశిశువుల జననీ జనకులు
అయిన ఈ రెండు కళ్లలో. . . ★